
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

మంగళవారం 10 డిసెంబరు 2024



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని పాత డీఆర్డీవో కార్యాలయంలో ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, భద్రత జాగ్రత్తలు పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకులు ఉన్నారు.

మహిళా గ్రూపు సభ్యులకు టోకరా!

రూ.కోటితో ఉడాయించిన కమ్యూనిటీ యాక్టివిస్ట్

మహిళలకు బ్యాంకు నోటీసులు ● మెదక్ జిల్లా నందిగామలో ఘటన

రామాయంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లో రుణాలు పొందిన మహిళా గ్రూపు సభ్యులకు సీఏ(కమ్యూనిటీ యాక్టివిస్ట్) టోకరా ఇచ్చింది. వాయిదాల రూపేణా చెల్లించిన డబ్బు తన సొంతానికి వాడుకోగా.. సభ్యురాళ్లకు బ్యాంకు నోటీసులొచ్చాయి. ఎనిమిది గ్రూపుల సభ్యులకు చెందిన సుమారు రూ.కోటితో ఆమె ఉడాయించగా.. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందిగామలో సోమవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన మహిళలు కోఆపరేటివ్ బ్యాంకులో గ్రూపుల పేర రుణాలు పొందారు. ఇందుకు సంబంధించి నెలవారీ కిస్తీలను నేరుగా బ్యాంకులో కాక అదే గ్రామ సీఏ ప్రవీణకు ఇచ్చి ప్రైవేట్ రసీదు తీసుకున్నారు. మహిళలు తమ వద్ద తీసుకున్న రుణం గడువు పూర్తవడంతో ప్రస్తుతం బ్యాంకు వారు వారి ఆస్తులు జప్తు చేస్తామని నోటీసులు జారీ చేశారు. దీంతో ఏం చేయాలో తెలియని సుమారు వంద మంది మహిళా సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం కూడా సదరు సీఏపై పోలీసు కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.



బ్యాంకు నోటీసులతో మహిళా గ్రూపు సభ్యురాళ్లు

అట్టహాసంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



సంగారెడ్డిలో జరిగిన సోనియాగాంధీ జన్మదిన సంబరాల్లో పోతరాజులతో కలిసి చిందేస్తున్న జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పోచమ్మలోళ్ల మహిళలతో జగ్గారెడ్డి

ప్రజావాణికి 127 ఫిర్యాదులు

- సంగారెడ్డి జిల్లాలో 74 అర్జీలు.. స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మెదక్ జిల్లాలో 53 దరఖాస్తులు రాగా, అర్జీలు తీసుకున్న అదనపు కలెక్టర్ నగేష్

6

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మెదక్ జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 5,855 మంది అభ్యర్థులు
- అదనపు కలెక్టర్ మెంచు నగేష్

6

11, 12 తేదీల్లో ఐఐటీహెచ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

6

సిబ్బంది లేక.. ఇబ్బంది..

అందోలు-జోగిపేట మునిసిపాలిటీలో అధికారుల కొరత

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు ఉంది అందోలు-జోగిపేట మునిసిపాలిటీ పరిస్థితి. కోట్లాది రూపాయల నిధులున్నా.. సరిపడా సిబ్బంది లేక పాలన కుంటుపడుతున్నది. కమిషనర్ మినహా కీలక ఉద్యోగులంతా డిప్యుటేషన్‌పై వచ్చినవారే కావడంతో వారానికి ఒకట్రెండు సార్లు వచ్చి పోతున్నారు. దీంతో, ప్రజా సేవలకు అంతరాయం ఏర్పడుతున్నది.

- తొమ్మిదిన్నరేళ్లలో 18వ కమిషనర్
- 48 పోస్టులకు 24 మంది మాత్రమే
- 26 మంది పారిశుధ్య కార్మికులకు నలుగురే
- విధుల్లో 29 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- ఇన్‌చార్జి ఆఫీసర్లతో కుంటుపడిన పాలన
- అదనపు బాధ్యతలతో వారానికోసారి రాక
- పౌర సేవలకు తీవ్ర ఆటంకం
- కుంటుపడుతున్న అభివృద్ధి

7





సంగారెడ్డి మునిసిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్, కమిషనర్, చైర్‌పర్సన్

మునిసిపల్ సమావేశం.. గరం గరం

- వాడీవేడిగా సంగారెడ్డి మునిసిపల్ సర్వసభ్య సమావేశం
- అక్రమ నిర్మాణాలపై అధికారుల నిలదీత
- ఆంధ్రజ్యోతి కథనంపై సుదీర్ఘ చర్చ

7

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు, ధ్రువపత్రాలు రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలానికి కేటాయించిన ఇంటి నంబర్లు, యాజమాన్య ధ్రువపత్రాలను మునిసిపల్ కమిషనర్ రద్దు చేశారు. 'సర్కారు భూమికి ఎసరు' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కమిషనర్ సురేష్‌పవార్ చర్యలు చేపట్టారు. మంజీరనగర్ 374/1 సర్వే నంబరులో 1,200 గజాల సర్కారు స్థలంలో కేటాయించిన పలు ఇంటి నంబర్లను రద్దు చేసినట్లు తెలిపారు. సదరు స్థలంలో చేపట్టిన నిర్మాణ పనులు నిలిపివేశామని పేర్కొన్నారు.

మమ్మల్ని ఆదుకోండి..

కలెక్టరేట్ ఎదుట అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల ధర్నా



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు నీట మునిగిపోయి నిరాశ్రయులమయ్యామని తమని ఆదుకోవాలని అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ చైర్మన్ సీహెచ్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు సంబంధించిన ఐదు వేల ప్లాట్లు పెద్దచెరువు మురుగు నీటిలో కూరుకుపోయాయని వాపోయారు. తమ ఆస్తులను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలుగు తెరిచి నీటిని దిగువకు వదిలి మా ప్లాట్లకు రక్షణ కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బ్రహ్మానందరావు, విజయ్‌కుమార్‌రెడ్డి, సంజయ్‌కుమార్, రతన్ లాల్, రమేష్, నాగభూషణరావు, సురేష్‌చౌదరి, సత్యనారాయణ, సత్తిరాజు, రంగారాజు, టీవీ.రావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రసాద్, సాయి బాబ, రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాధికారతకు ముందడుగు

- మెదక్‌లో ఇందిర మహిళాశక్తి భవనం
- రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఆధునిక హంగులతో నిర్మాణం
- హౌసింగ్ శాఖ కార్యాలయ స్థలం కేటాయింపు



మెదక్‌లో ఇందిర మహిళాశక్తి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

మెదక్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళాశక్తి భవనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లా కేంద్రాల్లో సొంత భవనాలను నిర్మించాలని సర్కార్ సంకల్పించింది. మెదక్ జిల్లాలో అన్ని వసతులతో మహిళ శక్తి భవన నిర్మాణానికి రూ. 5 కోట్లను మంజూరు చేసింది. దాంతో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ బోధన చౌరస్తా సమీపంలో నిరుపయోగంగా ఉన్న హౌసింగ్ శాఖ స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేశారు. సర్వే నెం 145/2లో ఎకరా స్థలాన్ని కేటాయించారు. పంచాయతీరాజ్‌శాఖ టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించనుంది. శిక్షణ గదులు, కార్యాలయం, భోజనశాల, ఓపెన్ ఎయిర్ థియేటర్, సిబ్బందికి గది, మొదటి అంతస్తులో సాధారణ ఉపయోగం కోసం గదులను నిర్మించనున్నారు.

తీరనున్న ఇబ్బందులు

2016లో మెదక్ కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు కావడంతో జిల్లా సమాఖ్య అందుబాటులోకి వచ్చింది. జిల్లా సమాఖ్య ప్రతీ నెల ఉన్నతాధికారుల సమీక్షలు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు సమాఖ్య కార్యాలయం ఉపయోగపడుతోంది. సొంత భవనం లేకపోవడంతో పాత తహసీల్దార్ కార్యాలయంలోని పైఅంతస్తులో సమాఖ్య కొనసాగుతోంది. ఒక హాల్, ఒక గది ఉండడంతో సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా ప్రభుత్వం జిల్లాలో ఆధునిక హంగులతో మహిళ సమాఖ్య భవనాన్ని నిర్మించిచేందకు నిశ్చయించింది. ఇందుకోసం రూ. 5కోట్ల నిధులను మంజూరు చేయడంతో పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

మహిళలకు ఎంతో ఉపయోగం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారు సమావేశాలు, సమాఖ్య కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఇందిరా మహిళాశక్తి భవనాలు ఎంతగానో ఉపయోపడుతాయి. స్వయం సహాయక సంఘాల శిక్షణ కేంద్రం, నైపుణ్య సామర్థ్యాల పెంపు, క్రెడిట్ సౌకర్యాలు వ్యవస్థాపకత అభివృద్ధి, మహిళలకు విద్య, అక్షరాస్యత, లైబ్రరీలు, ఇండోర్ గేమ్స్, వినోదం, విశ్రాంతికి వినియోగించనున్నారు. మహిళలు వ్యాపారం ఎలా చేయాలి, కుటీర పరిశ్రమల్లోని ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం వంటి అంశాలను చర్చించి, సాధికారత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బలహీన అట్టడుగు వర్గాల మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

జిల్లాలో ఇలా..

మెదక్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలు 13,640 ఉండగా వీటిలో 1,36,547 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. మండల సమాఖ్యలు 20, గ్రామసమాఖ్యలు 521 ఉన్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఇందిర మహిళా శక్తి భవనాలు కేటాయింపు స్వయం సహాయక మహిళలకు వరం లాంటిది. మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోంది. మహిళా సమాఖ్య భవనంలో శిక్షణ పొంది మహిళలు వ్యాపావేత్తలుగా ఎదగాలి. మెదక్ జిల్లా కేంద్రానికి ఇందిరా మహిళా శక్తి భవనానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

-మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్యే

అధికారుల నిర్లక్ష్యమే అక్రమార్కులకు ఆదాయం

- నర్సాపూర్‌లో రూ. కోట్లు విలువైన ఆర్టీసీ స్థలంపై కబ్జాదారుల కన్ను
- షెడ్లు వేసి చిరువ్యాపారులకు అద్దెకు..

8



టేకు ఆకుపై తెలంగాణ తల్లి చిత్రం

రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి నూతన చిత్రాన్ని నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్‌ఆర్టిస్ట్ శివకుమార్ ఇలా టేకు ఆకుపై రూపొందించారు.

-నారాయణఖేడ్, (ఆంధ్రజ్యోతి)



ఘణపురం ఆనకట్ట

యాసంగిపై అన్నదాత ఆశలు!

- పనుల్లో నిమగ్నమైన రైతాంగం
- మంజీర నీళ్లు విడుదలయ్యేనా?

కొల్చారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాతకు ఖరీఫ్‌లో దిగుబడి తగ్గడంతో నష్టపోయారు. యాసంగి సీజన్‌లోనైనా గట్టెక్కాలని రైతులు ఎన్నో ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొల్చారం మండలంలో రైతులు అత్యధికంగా వరి పంటనే సాగు చేస్తూ ఉంటారు. ఘణపురం ఆనకట్ట కింద సుమారు 25 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. మండల పరిధిలోని ఎనగండ్ల, మాదాపూర్, పైతర, రంగంపేటకు చెక్‌డ్యామ్ ద్వారా సాగునీరు అందితుంది. ఘణపూర్ ఆనకట్ట కింద ఉన్న కాలువల మరమ్మతు పనులు కొనసాగుతుండడంతో నీళ్ల విడుదల చేయడం లేదని రైతులు వాపోతున్నారు. యాసంగి సీజన్‌లోనైనా మంజీర నీళ్లను సాగుకు అందించాలని కోరుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల రైతులు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. సంగాయిపేట మంజీరా సొసైటీలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో సన్న రకం విత్తనాలు తీసుకురావడంతో దిగుబడి తగ్గగా, సొసైటీ సిబ్బందిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు సన్న రకం, దొడ్డు రకం రకాల రెండు రకాల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

శ్రీరాములపల్లిలో ప్రజాపాలన విజయోత్సవాలు

కోహెడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాములపల్లి గ్రామంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చేనేత కార్మికుల సహకార సమాఖ్య ఓఎస్డీ హిమాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. నేతన్న చేయూత పథకం కింద రూ.39 లక్షల చెక్కును కార్మికులకు అందజేశారు. మండలంలోని తంగళ్లపల్లి, హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామాలకు చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికునికి చెక్కు అందజేస్తున్న అధికారులు



పెళ్లి కావడం లేదని మనస్తాపంతో
యువకుడి ఆత్మహత్య



సంగు భాస్కర్ (ఫైల్)

నంగునూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వయసు మీరుతున్న పెళ్లి కావడం లేదని మనస్తాపనికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి రాజగోపాలపేట ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు సిద్ధన్నపేట గ్రామానికి చెందిన సంగు భాస్కర్(36) కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తనకు పెళ్లి కావట్లేదని మనస్తాపంతో బాధపడే వాడు. ఆదివారం కారు డ్రైవింగ్‌కి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రజావాణికి 127 ఫిర్యాదులు

- సంగారెడ్డి జిల్లాలో 74 అర్జీలు.. స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మెదక్ జిల్లాలో 53 దరఖాస్తులు రాగా, అర్జీలు తీసుకున్న అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 127 ఫిర్యాదులు అందాయి. సంగారెడ్డిలో 74 దరఖాస్తులు రాగా, మెదక్‌లో 53 వచ్చాయి. సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావుతో కలిసి వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధరణిపై 23, డబుల్ బెడ్‌రూం 6, పింఛన్లు 2, ఇతర సమస్యలపై 22 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ప్రతీ ఒక్క దరఖాస్తుపై



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



వినతులను స్వీకరిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి రోజు 10:15 నిమిషాలకు హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయాలని, అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి ప్రజావాణిలోని అర్జీలు..

- పౌతి మార్పుల కోసం మూడేళ్లుగా తిప్పుకుంటున్నారు కానీ, చేయడంలేదని సంగారెడ్డి జిల్లా కంది మండలం కలివెముల గ్రామానికి చెందిన వృద్ధురాలు తలారి సంగమ్మ అర్జీని అందజేశారు. తన భర్త తలారి సంగయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన పేరున ఉన్న వ్యవసాయ భూమిని తన పేరున పౌతి మార్పులు చేయాలని మండల తహసీల్దార్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తనకు నడచేందుకు కూడా ఇబ్బంది అవుతున్నా, ఇతరుల సహాయంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, కలెక్టరమ్మ దగ్గరికి వెళితే, పని జరుగుతుందని తెలిసి ఇక్కడి వచ్చానని వృద్ధురాలు కన్నీరుమున్నీరైంది. తనకు పౌతి మార్పులు చేసి న్యాయం చేయాలని దీనంగా వేడుకున్నది.
- తన పొలంలో పైపులైన్ వేసుకోకుండా కొందరు పెత్తందారులు అడ్డుకుంటున్నారని అందోల్ మండలం రోళ్లపహాడ్ గ్రామానికి చెందిన గౌతాపురం బాలయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. పైపులైన్ వేసుకునేలా అనుమతినివ్వాలని కోరాడు.

రైతులను వ్యాపారవేత్తలను చేయడమే లక్ష్యం

- కృషి కల్ప ఫౌండేషన్ కృషి
- అధునాతన పద్ధతులను పాటించాలి
- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చి రైతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి కల్ప ఫౌండేషన్ కృషి చేస్తుందని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సోమవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కృషి కల్ప, జిల్లా యంత్రాంగం సహకారంతో నిర్వహించిన అగ్రిసినర్జీ-2024 కార్యక్రమానికి కలెక్టర్ మనుచౌదరి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 20కిపైగానే అగ్రిటెక్ స్టార్టప్‌ల ప్రదర్శన తిలకించారు. రైతులు, ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్) సీఈవోలు, డైరెక్టర్లు, విద్యార్థులతో మాట్లాడారు. నూతన వ్యవసాయ, ఉద్యాన పరిష్కారాల ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, విజయగాథలు, మార్కెట్ లింకేజీ మార్గదర్శనలపై చర్చించి రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను సరైన ధరకు అమ్ముకునేందుకు ఎఫ్‌పీవోల ద్వారా కృషి కల్ప ఫౌండేషన్ సహకరిస్తుందని అన్నారు. పెస్టిసైడ్లను అందించి వాటి వినియోగం, మార్కెట్‌లో డిమాండ్ ఉండి, దిగుబడినిచ్చే పంటలను




మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

ప్రోత్సహించి, సాగులో అధునాతన పద్ధతుల వినియోగంపై అవగాహన కల్పిస్తుందన్నారు. అక్కన్నపేట మండలంలో ప్రహర్ష, ప్రసిద్ధ ఎఫ్‌పీవోల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నదని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి అధునాతన పద్ధతులు జిల్లాలోని రైతులకు ప్రయోజనకరంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోలు, విద్యార్థులు స్పష్టమైన అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. రైతులు బృందంగా ఏర్పడి ఎఫ్‌పీవోలుగా ఏర్పడాలని కోరారు. ప్రహర్ష, ప్రసిద్ధ ఎఫ్‌పీవోల ద్వారా సేకరించిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి సుముఖంగా ఉన్న అగ్రి కంపెనీలతో ఎంవోయూలను కుదిర్చారు. అనంతరం వివిధ సంస్థలు రైతులకు అందించే అవకాశాలను వివరించాయి. అనంతరం కలెక్టర్ కృషికల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్‌తో కలసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను తికలకించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ శాఖ అధికారి రాధిక, నాబార్డ్ డీడీయం నిఖిల్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.





స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, స్టాల్‌లో పరికరాన్ని టెస్ట్ చేస్తున్న విద్యార్థులు





11, 12 తేదీల్లో ఐఐటీహెచ్‌లో
స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి



కందిలోని ఐఐటీ హైదరాబాద్

కంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ సాంకేతిక సమస్యలను పరిష్కరించడం కోసం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో వ్యవసాయం థీమ్‌పై స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 51 కేంద్రాల్లో జరగనున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు ఐఐటీహెచ్ హోస్ట్ చేస్తోంది. ఇందులో రైతులకు ప్రత్యక్ష మార్కెట్ యాక్సెస్ కోసం మొబైల్ యాప్, ఏఐ డ్రివెన్ క్రాప్ డిసీజ్ ప్రిడిక్షన్, అధిక దిగుబడి రావడానికి స్థిరమైన ఎరువుల వినియోగం, స్థిరమైన మార్కెట్ యాక్సెస్ కోసం కాంట్రాక్ట్ ఫార్మింగ్ తదితర అంశాలపై విద్యార్థులు ఆవిష్కరణలను రూపొందించనున్నారు. విద్య, పరిశ్రమల భవిష్యత్తు, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడమే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లక్ష్యంగా పెట్టుకున్నదని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలకు
పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల కోసం జిల్లాలోని మెదక్‌లో 11, నర్సాపూర్‌లో 3, తూప్రాన్‌లో 2, మొత్తం 16 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మౌలిక సదుపాయాలైన తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, శానిటైజేషన్ వంటివి చేపట్టాలన్నారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 5, రూట్ ఆఫీసర్స్ 5, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్ 16 మంది చొప్పున విధులు నిర్వహిస్తారన్నారు. 58 మంది పరిశీలకులు, 44 మంది బయోమెట్రిక్, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. లోనికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ పేపర్-1 పరీక్ష జరగనుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు.. హిస్టరీ, పోలిటీ, సొసైటీ పేపర్ -2 పరీక్ష ఉంటుందన్నారు. 16న ఉదయం ఎకనామి, డెవలప్‌మెంట్ పేపర్-3, మధ్యాహ్నం తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ అంశంపై పేపర్-4 పరీక్షకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5,855 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. బయోమెట్రిక్ హాజరు ఉంటుందని, సమాయానికి అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్





స్కైవాక్ నుంచి దూకి.. సూసైడ్‌కి యత్నించి

ఉప్పల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : ఉప్పల్ స్కైవాక్ నుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి యత్నించిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. సంగారెడ్డిలోని భవానీనగర్‌కు చెందిన ఎస్‌ఏ ఫ్రాన్సిస్(34) ఉప్పల్ స్కైవాక్ ఎక్కి ఎల్బీనగర్ బస్టాప్ వద్ద ట్రాఫిక్ బూత్‌పైకి దూకడంతో పోలీసులు స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. ఎడమకాలుకి గాయలయ్యాని ప్రాథమిక చికిత్స అనంతరం విచారించిన పోలీసులుకు కుటుంబకలహాలతో మతిస్థిమితం కోల్పోవడం జరిగిందని వెల్లడించారు.

సిబ్బంది లేక.. ఇబ్బంది..

అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో అధికారుల కొరత

- తొమ్మిదిన్నరేళ్లలో 18వ కమిషనర్
- 48 పోస్టులకు 24 మంది మాత్రమే
- 26 మంది సఫాయీ కార్మికులకు నలుగురే..
- ఇన్‌చార్జి ఆఫీసర్లతో కుంటుపడిన పాలన



అందోలు-జోగిపేట మున్సిపల్ కార్యాలయం

జోగిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపాలిటీ సిబ్బంది లేమితో కునారిల్లుతున్నది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా ఉంది ఇక్కడి పరిస్థితి. రూ.కోట్లాది నిధులున్నా... సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాలన కుంటుపడుతున్నది. ప్రధానంగా పౌర సేవలకు తీవ్ర ఆటంటకం కలుగుతోంది. ఇక్కడ ఒక కమిషనర్ మినహా.. దాదాపు మిగతా కీలక సిబ్బంది డిప్యుటేషన్‌పై పనిచేయడం, లేదా ఇతర చోట్ల అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారానికి ఒకట్రెండు సార్లు వచ్చిపోవడమో జరుగుతోంది. కమిషనర్ పోస్టుకు కూడా గత పదిహేను రోజుల వరకూ రెగ్యులర్ అధికారి లేకపోవడం గమనార్హం. కేవలం తొమ్మిదిన్నరేళ్లలో 17 మంది కమిషనర్లు మారగా.. ఇప్పుడున్నది 18వ కమిషనర్. ఇక్కడ మొత్తం 48 రెగ్యులర్ అధికారులు, సిబ్బంది పనిచేయాల్సి ఉండగా.. కేవలం 24 మంది మాత్రమే ఉన్నారు. అధికారులు, సిబ్బంది కొరతతో శానిటేషన్, టౌన్ ప్లానింగ్, నీటి సరఫరా తదితర విభాగాల పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.

కీలక విభాగాల్లోనూ...

మున్సిపాలిటీకి అత్యంత ఆవశ్యకమైన ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ అధికారి, సహాయకుడు (టీపీవో, టీపీఏ), అకౌంటెంట్ పోస్టులకు రెగ్యులర్ అధికారులు నియామకం కాలేదు. దీంతో ఇతర చోట్ల పనిచేసేవారికి ఇక్కడి బాధ్యతలు అదనంగా అప్పజెప్పడంతో వారంతా వారినికి ఒకట్రెండు సార్లు వచ్చిపోతున్నారు. సంగారెడ్డిలో పనిచేసే ఏఈకి అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో ఆయన ఏకకాలంలో రెండు మున్సిపాలిటీల్లో రూ. కోట్లాది నిధుల అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కూడా లేకపోవడంతో పర్యవేక్షణ కరువై అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడుతున్నది. ఇక శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేక.. ఆ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్‌కు అప్పజెప్పడంతో దాని నిర్వహణ సరిగాలేక పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య కార్మికుల పోస్టులదీ అదే పరిస్థితి. వాస్తవానికి ఈ మున్సిపాలిటీకి 26 సఫాయి కార్మికుల రెగ్యులర్ పోస్టులు మంజూరుకాగా, కేవలం నలుగురే ఉన్నారు. దీంతో 29 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. ఇది మున్సిపాలిటీ ఆర్థికంగా భారంగా మారింది.

ఖజానాకు గండి..

సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేసే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. దీంతో ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇదే అదునుగా పైరవీకారులు రెచ్చిపోయి ప్రజల జేబులకు చిల్లులు పెడుతన్నారు. కొంతమంది దలారులు రంగప్రవేశం ఇండ్ల నిర్మాణానికి తొందరగా అనుమతులు ఇప్పిస్తామని దరఖాస్తుదారులను నమ్మిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు సైతం పెద్దఎత్తున జరుగుతున్నాయి. మున్సిపాలిటీకి శ్వాసలాంటి రెవెన్యూ విభాగనిది ఇదే దారి. వాణిజ్య, వ్యపార ట్రేడ్ లైసెన్సులు, ఇంటి, దుకాణాల పన్నుల విషయంలో కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కవుతున్న కొందరు వ్యాపారులు తమ పన్నుల అసెస్‌మెంట్‌ను తగ్గించుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీ ఖజానకు భారీగా గండిపడుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ రెగ్యులర్ అధికారులతో భర్తీ చేసి మెరుగైన సేవలందేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో కొంత జాప్యం..



మున్సిపాలిటీలో పలు ముఖ్యమైన పోస్టులు ఇంకా మంజూరుకాలేదు. ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో ఇన్‌చార్జి అధికారులతో సేవలందిస్తున్నాం. వారికి ఇతర మున్సిపాలిటీల్లోనూ బాధ్యతలు ఉండడంతో పూర్తిస్థాయిలో పనులు జరగడంలో కొంత జాప్యం జరుగుతుంది. రెగ్యులర్ అధికారులను నియామకంతోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది. రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు నలుగురే ఉండడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. దీంతో నెలకు రూ.4.35 లక్షలను మున్సిపల్ నిధుల నుంచి వారికి చెల్లించాల్సి వస్తోంది. ఇది మున్సిపాలిటీకి ఆర్థికంగా పెను భారమే.

-తిరుపతి, మున్సిపల్ కమిషనర్



ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

నేటి నుంచి మల్లికార్జునస్వామి జాతర

కోహీర్, డిసెంబరు 9 : (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో ఈ నెల 10 నుంచి 17వ వరకు మల్లికార్జునస్వామి(సట్టి) జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో భ్రమరాంబ, మల్లికార్జున, కేతమ్మ, లింగము, నంది, వినాయక విగ్రహాల పునఃప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ ఉదయం 8.15 గంటలకు హనుమాన్ మందిరం నుంచి విగ్రహాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అలాగే 11న శాంతి పాఠం, గోమాత పూజ, అవాహిత దేవత పూజ. 12న ఉదయం 8 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, పీఠదేవతల హోమాలు, 14న గ్రామ దేవతలైన మైసమ్మ, ఊరదమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పణ, 15న మల్లికార్జున స్వామి కల్యాణం, అగ్నిగుండం ప్రవేశం, స్వామి వారికి అభిషేకం, గొలుసు తెంపుట, కుంకుమార్చన స్వామి వారి జీవిత చరిత్రపై ఒగ్గు కథ, రాత్రి 8గంటల నుంచి భజన కార్యక్రమంతో పాటు స్వామివారి రథోత్సవం, 16న కేతమ్మ, మల్లికార్జున స్వామి వేషధారణలో ఊరేగింపు, లగ్నం, సాయంత్రం 4.30కు రథోత్సవం, 17న సమ్మక్క జీవిత చరిత్ర బయలు నాటకం ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి

- నలుగురికి గాయాలు

నర్సాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీ కొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం వనపర్తికి చెందిన అధ్యాపకుడు బింగి శ్రీకాంత్(30) తన నలుగురు స్నేహితులు శివరాములు, యాదగిరి, శివకృష్ణ, రాఘవేంద్రతో కలిసి ఏడుపాయల దేవస్థానం దర్శనానికి వచ్చారు. తిరుగుప్రయాణంలో నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని జలహనుమాన్ మలుపు రాగానే హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న ఇన్నోవా కారు వీరి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్ మృతదేహన్ని పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఇన్నోవా కారు డ్రైవర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళ..



లక్ష్మి(ఫైల్)

చేగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై అహ్మద్ మోహినోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన వట్టేపు లక్ష్మి (40) తన భర్త వట్టేపు నాగరాజుతో కలిసి నార్సింగి శివారులో ఉన్న తన వ్యవసాయ పొలం వద్దకు పనుల నిమిత్తం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి వారిని ఢీకొట్టగా లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన నాగరాజును స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న వ్యక్తి

మిరుదొడ్డి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చెప్యాల గ్రామానికి చెందిన యాదగిరి మిరుదొడ్డి నుంచి చెప్యాలకు, మిరుదొడ్డికి చెందిన కుమ్మరిరాజు అల్వాల నుంచి మిరుదొడ్డి ద్విచక్రవాహనాలపై వస్తుండగా ప్రమాదవశాత్తు రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పోలీసులు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ పరశురాములు అంబులెన్స్ ఆలస్యం అవుతందనే కారణంతో క్షతగాత్రులను పోలీస్ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటారు.

కల్వర్టును ఢీకొన్న కారు

చేర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారులోని ప్రమాదకర మూలమలుపు వద్ద కల్వర్టును సోమవారం ఉదయం ఓ కారు ఢీ కొన్న సంఘటనలో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన జయకోటి రమేశ్‌తో పాటు మరోవ్యక్తి కారులో సిద్దిపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో ముస్త్యాల శివారు మూలమలుపు వద్ద కారు అనుకోకుండా అదుపుతప్పడంతో కల్వర్టును ఢీ కొంది. దీంతో కారు అద్దాలు, ఇంజన్ ముందరి భాగం దెబ్బతినడంతో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. కొద్దిరోజులక్రితం బచ్చన్నపేట మండలానికి చెందిన ఇరువురు ఇదే కల్వర్టు సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం మరిచిపోకముందే మరో ప్రమాదం సంభవించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ పవన్



నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం రాత్రి అక్కన్నపేట మండలంలోని గండిపల్లి నుంచి రామవరం వెళ్లే దారిలో ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై అక్రమంగా రవాణా చేస్తున్న 10 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హేన్య తండాకు చెందిన ముడవత్ కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఎక్సైజ్ ఎస్‌ఐ దామోదర్ శెట్టి, కానిస్టేబుళ్లు సతీష్, గణేష్ ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం మార్చడంపై మండిపాటు



మాట్లాడుతున్న ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు

మర్కుక్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ ఆకృతిని మార్చడంపై తెలంగాణ ఉద్యమకారుడు, జగదేవ్‌పూర్ ప్యాక్స్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. తెలంగాణ చరిత్ర, ఖ్యాతిని అవమానపరిచే విదంగా ప్రస్తుత తెలంగాణ తల్లి ఆకృతి ఉందన్నారు. సోమవారం ఎర్రవెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతమాత చిత్రాన్ని తలపించేలా తెలంగాణ తల్లికి రూపం ఇవ్వాలన్న కేసీఆర్ సూచన మేరకు ప్రొఫెసర్ గంగాధర్ నాడు ఆ రూపాన్ని ఇచ్చారన్నారు. మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, యాదగిరి, మంకేశ్ సత్తయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో 50 ఏళ్ల స్వర్ణోత్సవాలు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1974 బ్యాచ్ పూర్తయి 50 సంవత్సరాలు పూర్తయినందున కళాశాలలో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్న స్వర్ణోత్సవ సంబరాల వేదిక కమిటీ సభ్యులు హరిశ్చంద్ర తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిటీ సభ్యులు అమ్మన చంద్రారెడ్డి, మహిపాల్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 20న సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం ఈ సంబరాలకు వేదిక కానుందని తెలిపారు. ఈ స్వర్ణోత్సవాలు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరుగుతాయన్నారు. 1974లో డిగ్రీ పూర్తి చేసిన అన్ని బ్యాచ్‌ల, గ్రూపుల విద్యార్థులు ఈ సంబరాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 1974 లో సిద్దిపేటలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు చదువుకున్నారని, ఇప్పుడు ఎక్కడ ఉన్న సంబరాలలో పాల్గొనాలన్నారు. పూర్వ విద్యార్థులకు అధ్యాపకులకు ఈ సందర్భంగా సన్మానం చేస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం కమిటీ సభ్యులను నేరుగా కానీ, ఫోన్ ద్వారా 9618195145 నంబర్ ను సంప్రదించాలని కోరారు.

బాలల హక్కులకు భంగం కలగకుండా చూడాలి

- జడ్పీ సీఈవో జానకీరెడ్డి

సంగారెడ్డి అర్బన్ /సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులకు భంగం కలిగించకుండా చూడాలని జడ్పీ సీఈవో జానకీరెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం బేటీ పడావో బేటీ బచావో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బాలల హక్కుల చట్టాలను అమలు చేయడం అత్యంత ప్రాముఖ్యమని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, బాల్య వివాహాల నిరోధం, బాలల అక్రమ రవాణా లాంటి అంశాలపై సమాజాన్ని ఇంకా చైతన్యపరచాలన్నారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరమన్నారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, హెల్ప్‌లైన్ నంబర్లపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బాల బాలికల సమాన హక్కులపై అవగాహన కల్పించి బాలల భవిష్యత్తును కాపాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో స్వప్న, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సూర్యకాంత్, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బేటీ పడావో బేటీ బచావో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈవో జానకీరెడ్డి

నేడు బైక్ వేలం

నారాయణఖేడ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు సీజ్‌డ్ పల్సర్ బైక్‌లను వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకనటలో తెలిపారు. ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన బజాజ్ పల్సర్ టీఎస్15ఈటీ3376ను ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వేలం వేయనన్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం నారాయణఖేడ్ కార్యాలయాన్ని సంప్రదించాలని, నిర్ణిత సమయానికి నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన జక్కన్నపేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బుర్క నర్సింహులు(47) సోమవారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న మురుగు కాలువలోకి మూత్ర విసర్జనకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో బోర్లాపడి ఊపిరాడక మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై సత్యనారాయణ తెలిపారు.

12న మల్కాపూర్ చెరువులో యుద్ధ వాహనాల పరీక్షలు

కంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారుచేసిన నూతన యుద్ధ వాహనాలను ఈ నెల 12న (గురువారం) కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ పెద్ద చెరువులో ఆర్మీ అధికారుల పరీక్షించనున్నారని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ లైసనింగ్ అధికారి బాలకిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు అనంతరం ఈ యుద్ధ వాహనాలను సైన్యం అవసరాలకు ఉపయోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే పరిశీలన

మనోహరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీడిపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను ఆర్డీవో జయచంద్రరెడ్డి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ వినియోగంలో ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. సర్వేలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మీనర్సింలు, డీటీ శ్రీకాంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యమెందుకు?

● అధికారులపై ఎమ్మెల్యే మాణిక్‌రావు ఫైర్

జహీరాబాద్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) నియోజకవర్గంలో కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ సమాచారం ఎందుకివ్వడం లేదని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మీ షాదీముబారక్ చెక్కులను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వేదికపైకి న్యాల్‌కల్, కోహీర్ తహసీల్దార్లను పిలిచి సమాచారం ఇవ్వకపోవడం పద్ధతేనా అంటూ వారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకముందు ఇలాంటి తప్పులుచేస్తే ఉపేక్షించబోమని తీవ్రంగా హెచ్చరించారు.

అధికారుల నిర్లక్ష్యమే.. అక్రమార్కులకు ఆదాయం

● నర్సాపూర్‌లో రూ. కోట్ల విలువైన ఆర్టీసీ ఖాళీ స్థలంపై కబ్జాదారుల కన్ను
● షెడ్లు వేసి చిరువ్యాపారుల నుంచి అద్దె, అడ్వాన్సులను దండుకుంటున్న అక్రమార్కులు
● దుకాణ సముదాయం నిర్మించి అద్దెకిస్తే ఆర్టీసీకి అదనపు ఆదాయం



నర్సాపూర్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆర్టీసీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లు

నర్సాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఆనుకుని రూ. కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలం కబ్జాకు గురవుతున్నది. నర్సాపూర్ పట్టణంలో బస్టాండ్ కోసం 30 ఏళ్ల క్రితం ఐదెకరాల స్థలాన్ని కేటాయించారు. అందులో ఒక ఎకరా మేర బస్టాండును ఏర్పాటు చేయగా మిగతా మిగతా నాలుగు ఎకరాల్లో కొంత భాగం కుంటతో పాటు ఖాళీ స్థలం అలాగే ఉంది. మిగతా స్థలంలో డిపో ఏర్పాటు చేస్తే బస్టాండు వద్దనే అనువుగా ఉంటుందని ఆలోచించి ముందుచూపుతో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే రెండు ఏళ్ల క్రితం మరో చోట ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఖాళీ స్థలం ఎంతో విలువైనది కావడమే కాక జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ఈ భూమిని ఆర్టీసీ అధికారులు ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంది

ఖాళీస్థలానికి పెరిగిన డిమాండ్

నర్సాపూర్ పట్టణం అభివృద్ధి చెందుతుండటంతో ప్రధాన రోడ్డుపై వ్యాపార సముదాయాలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం గజం ధర రూ. రూ.20వేలకు పైగా పలుకుతుంది. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యాన్ని అదునుగా తీసుకొని కొందరు స్థానిక పెద్దలు జాతీయ రహదారికి ఆనుకుని ఆర్టీసీ స్థలంలో అప్పట్లో సుమారు 20 వరకు చిన్నచిన్న రేకుల షెడ్లు వేసి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇస్తూ పెద్దమొత్తంలో ఆర్జిస్తున్నారు. అడ్వాన్సుల కింద తీసుకుంటూ నెలకు రూ. 5వేల నుంచి 10వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పలుమార్లు ఆర్టీసీ అధికారులు ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని యత్నించినప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడితో వెనుకడుగు వేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా మొదట్లో ఈ డబ్బాలు ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసినా ఎందుకో నీరుగారిపోయింది. దీంతో కోట్లలో విలువ చేసే ఆర్టీసీ స్థలం ప్రస్తుతం కొన్నేళ్లుగా ఇతరుల ఆక్రమణలో ఉంటుంది.

బస్టాండు ప్రాంగణంలో ఖాళీ స్థలం

బస్టాండు ప్రాంగణానికి కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో 4 ఎకరాల స్థలంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలంలో రేకుల షెడ్లతో ఆక్రమణకు గురికాగా మిగతా స్థలం ప్రస్తుతం వృథాగా ఉంది. ఈ వృథాగా ఉన్న స్థలంలో కొంత భాగం కుంట ఉండగా రెండేళ్ల క్రితం ఆ కుంటను పట్టణ ప్రగతిలో భాగంగా పూడ్చివేశారు. ఆ స్థలంలో గార్డెనింగ్ ఏర్పాటు చేస్తామని అప్పట్లో మున్సిపల్ అధికారులు పేర్కొనగా ఆర్టీసీ వారు ఆ స్థలంలో పలు షాపింగ్ కాంప్లెక్స్ లేక ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు. కాని అటు మున్సిపల్ కాని, ఇటు ఆర్టీసీ కాని ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగించకుండా వృథాగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ ఖాళీగా ఉన్న స్థలంలో గార్డెనింగ్ ఏర్పాటు చేస్తే బస్టాండుకు వచ్చే వారికి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది కదా అని స్థానికులు అంటున్నారు.

దుకాణ సముదాయం నిర్మిస్తే ఆర్టీసీకి ఆదాయం

నర్సాపూర్ బస్టాండు సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇతరుల ఆక్రమణలో ఉన్న స్థలాన్ని ఆర్టీసీ స్వాధీనం చేసుకుని అక్కడ సుమారు 20 వరకు దుకాణాల సముదాయం ఏర్పాటు చేసే అవకాశముంది. తద్వారా అద్దెల రూపంలో ఆర్టీసీకి పెద్ద మొత్తంలో శాశ్వతంగా ఆదాయం సమకూరనుంది. ప్రస్తుతం చిరు వ్యాపారులు ఇక్కడ రేకుల షెడ్లలో ఉంటూ ఉపాధి పొందుతున్నందున వారికే ఆర్టీసీ అధికారులు అద్దెలకు ఇచ్చేలా వారిని ఒప్పించి దుకాణాలు నిర్మించడానికి ఆర్టీసీ పూనుకుంటే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్రస్తుతం చిరువ్యాపారుల నుంచి అద్దెలను ఇక్కడ రేకుల షెడ్లు వేసిన కొంతమంది పెద్దలు దండుకుంటున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం కోల్పోవడమే కాకుండా రూ. కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలం ఇతరుల ఆక్రమణలో ఉంది.



బస్టాండు ప్రాంగణంలో వృథాగా ఉన్న ఖాళీ స్థలం

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సిందే



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్/జిన్నారం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక దీక్షలు నాల్గవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖలో కీలకంగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తమ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. కాగా సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీటీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కమ్రోద్దిన్, తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి అడివప్ప సంఘీభావం తెలిపారు. కాగా జిన్నారంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చేపట్టనున్న విధుల బహిష్కరణ కార్యక్రమ నోటీసును ఎంఈవో కుమారస్వామికి అందజేశారు. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఈనెల 10నుంచి విధులు బహిష్కరించాలని నిర్ణయించినట్లు ఉద్యోగులు శైలజ, శ్రీనివాస్, రేణు, రజిత, భాస్కర్ తదితరులు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు : అడిషనల్ ఎస్పీ



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అడిషనల్ ఎస్పీ సంజీవరావు అన్నారు. సంగారెడ్డి శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎస్వీ జూనియర్ కళాశాల ఫస్టియర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. క్రమ శిక్షణ, సమాజం పట్ల గౌరవం తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల భక్తి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరవేస్తుందన్నారు. యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నగదు బహుమతులు అందజేశారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

కాళ్లకల్‌లో ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



దండుపల్లి శుభం గార్డెన్‌లో నిర్వహించిన మహాపడిపూజలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతా ప్రభాకర్, ఎంపీపీ నవనీతారవి

మనోహరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం దండుపల్లిలోని శుభం గార్డెన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురుస్వాములు జెగ్గ ప్రభాకర్ గౌడ్, పురం గిరిధర్ ముదిరాజ్ గురు స్వాముల ఆధ్వర్యంలో 18వ మహాపడి పూజ కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 వందల మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ పాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, ఉప సర్పంచ్ రాజు యాదవ్, స్వాములు, రవి, నాగరాజు, కృష్ణ, గోపాల్, సురేష్, శివ, పాల్గొనారు.

మునిసిపల్ సమావేశం.. గరం గరం

● వాడీవేడిగా సంగారెడ్డి మునిసిపల్ సర్వసభ్య సమావేశం
● అక్రమ నిర్మాణాలపై అధికారుల నిలదీత
● 'ఆంధ్రజ్యోతి' కథనంపై సుదీర్ఘ చర్చ

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి గ్రేడ్ వన్ మునిసిపల్ పాలకవర్గ సాధారణ సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ట్రైనీ కలెక్టర్ మనోజ్ హాజరయ్యారు. పట్టణంలో ఆక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం తాగునీరు తదితర సమస్యలపై పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. 'సర్కారు భూమికి ఎసరు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపైనే సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు లేకుండానే ఇంటి నంబర్లను ఎలా కేటాయించారంటూ కౌన్సిలర్లు కొత్తపల్లి నాని, మందుల నాగరాజు, నాయికోటి రమేశ్, శేక్ సాబేర్‌లు అధికారులను నిలదీశారు. తక్షణమే ఇంటి నంబర్లను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు మునిసిపల్ కమిషనర్ సురేష్ పవార్ స్పందిస్తూ వెంటనే ఇంటి నంబర్లను తొలగిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో తడి, పొడి చెత్తను సేకరించేందుకు ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణీ చేయాలని, వైకుంఠ రథాలకు ఉచితంగా డీజిల్ పోయాలని కౌన్సిలర్ నాయికోటి రామప్ప కోరారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రద్దీ లేని ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానా విధించాలని సూచించారు. కేవలం 10/12 సైజు కలిగిన ఫ్లెక్సీలను మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. వాటికి రూ.300 ఫీజులు వసూలు చేసి అనుమతులు ఇవ్వాలని టీపీవో కరుణాకర్‌ను ఆదేశించారు. కౌన్సిలర్ మందుల నాగరాజు, కొత్తపల్లి నాని, కో ఆప్షన్ సభ్యుడు గోవర్ధన్‌నాయక్‌లు మాట్లాడుతూ పట్టణంలో 1,459 కుక్కలకు ఆపరేషన్ చేసినట్లు రికార్డులు రాసి రూ.18 లక్షలు ఖర్చు చేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనర్ సురేష్ పవార్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, టీపీవో కరుణాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలి

● తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : అవినీతి నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ కోరారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని, అవినీతి నిర్మూలనలో మనమందరం కలిసికట్టుగా పనిచేస్తే అవినీతి రహిత భారతదేశాన్ని నిర్మించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జంతు శాఖ అధిపతి రమేశ్‌కుమార్, అధికారులు సదయకుమార్, జగదీశ్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో జీవశాస్త్ర ప్రతిభా పోటీలు



వెల్దుర్తి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మెదక్ అర్బన్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి జీవ శాస్త్ర ప్రతిభాపోటీలు సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలో తెలుగు మీడియం నుంచి ప్రథమ చరణ్(జడ్పీహెచ్ఎస్ రాజ్‌పల్లి), ద్వితీయ అరుణ్ (జడ్పీహెచ్ఎస్, మక్తభూపతిపూర్), ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ సిర్తా తస్నీమ(జీజీహెచ్ఎస్ మెదక్), ద్వితీయ భానుప్రకాష్(జడ్పీహెచ్ఎస్, రాజ్‌పల్లి) నిలిచారు. విజేతలకు ఎంఈవో నీలకంఠం బహుమతులు అంజేశారు.

●నర్సాపూర్: విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో పాటు వారికి సైన్సు పట్ల మరింత అవగాహన పెంపొందించేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని జిల్లా సైన్సు అధికారి రాజిరెడ్డి తెలిపారు. సోమవారం నర్సాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన టెస్టులో ప్రతిభ చూపినవారికి బహుమతులు అందించారు.

● చేగుంట: చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో, అలాగే నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్టు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారికి పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి, ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

● వెల్దుర్తి: ప్రతి విద్యార్థి జీవశాస్త్ర విజ్ఞానం, పర్యావరణ పరిరక్షణలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో యాదగిరి అన్నారు. సోమవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జీవశాస్త్రంపై మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

'కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి'

కోహీర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలంటూ సోమవారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కోహీర్ మండల ఎంపీడీవో భారతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ తాము సర్వేలు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఓ పక్క చేయాల్సిన పని, మరోపక్క వరుస వీడియో కాన్ఫరెన్సులు, సమీక్షలతో ఇబ్బందిగా ఉందని వాపోయారు.

కుర్తివాడ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్

పాపన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ప్రిసైడింగ్ అధికారిగా, పోలింగ్ అధికారులుగా విధులు నిర్వహించారు విద్యార్థులు ఓటర్లుగా బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఘనంగా 'సెమీ క్రిస్మస్'

రామచంద్రాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పట్టణంలోని భారతీనగర్(ఎల్ఐజీ)లో ఆదివారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు పాస్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వి.ఆదర్శరెడ్డి మాట్లాడుతూ భగవంతుడిపై నమ్మకముంచి ఆయా ధర్మాల చొప్పున ముందుకు సాగితే ఆ సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

వట్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో వట్‌పల్లి మండలానికి 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి పక్కా భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్టు వట్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మీ శేషారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ జ్యోషి అన్నారు. సోమవారం వట్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రి పక్కా భవన నిర్మాణం పనుల కోసం వారు సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అల్లాదుర్గం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకట్‌రావు, తధితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు చెక్కుల పంపిణీ

సదాశివపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సదాశివపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం హెల్ప్‌హెల్ప్ గ్రూపులకు రూ.70లక్షల విలువ చేసే చెక్కులను మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ పాటిల్, కమిషనర్ ఉమా చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని పది మంది వీధి విక్రయదారులకు రూ.5లక్షల చెక్కు అందజేశారు. సెప్టిక్ ట్యాంకు క్లీనర్లకు పురపాలక సంఘం నుంచి మూడు పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ కిట్లను అందజేశారు. అనంతరంర పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న జవాన్లకు సన్మానం చేశారు.

'ఆశా'లపై పోలీసుల దౌర్జన్యం అమానుషం

నర్సాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో ధర్నా చేస్తే స్పందించాల్సింది పోయి పోలీసుల చేత అక్రమంగా అరెస్టులకు పాల్పడటం దారుణమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆశా వర్కర్లపై అమానుషంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొరాయించిన బ్రాహ్మణపల్లి రైల్వే గేటు

తూప్రాన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే గేటు మొరాయించడంతో వాహనదారులు సోమవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గజ్వేల్-సంగారెడ్డి రహదారిపై తూప్రాన్ పరిధిలో బ్రాహ్మణపల్లి రైల్వే లైన్‌కు అడ్డుగా లెవల్ క్రాసింగ్ గేటు ఏర్పాటు చేశారు. సోమవారం రైలు రావడంతో గేటు వేశారు. రైలు వెళ్లిన వెంటనే గేటు తీసేందుకు యత్నించగా పైకి లేవలేదు. సాంకేతిక సమస్యతో మొరాయించింది. ఇరువైపులా వాహనాలు నిలిచి అరగంటకుపైగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను అభినందిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ సభ్యుల నియామకానికి సోమవారం సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. సంగారెడ్డి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మున్నూరు రోహిత్ ప్యానెల్ నుంచి కంది మండలం అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, సంగారెడ్డి మండల అధ్యక్షుడిగా వంశీధర్ రెడ్డి, సదాశివపేట మండలం అధ్యక్షుడిగా ఎండీ సాజిద్ గెలుపొందారు. గెలుపొందిన కమిటీ సభ్యులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, యువకులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు





హత్నూర, రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లలో అరెస్ట్ అయిన తాజా మాజీ సర్పంచులు

న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనిసర్పంచుల చలో అసెంబ్లీ పిలుపు నేపథ్యంలో సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని తాజామాజీ సర్పంచుల ను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం ఆయా మండలాల్లోని స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో సర్పంచులపై ప్రేమ కురిపించిన సీఎం రేవంత్ రెడ్డి నేడు పెండింగ్ బిల్లులు ఇవ్వమంటే అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాభివృద్ధి కోసం సర్పంచులు అప్పులు చేసి పనులు చేశారని ఏడాది గడుస్తున్నా బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, వెంటనే పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పస్తాపూర్‌లో గల ఎస్వీ పంక్షన్‌హాల్ నియోజకవర్గంలోని 1,304 లబ్ధిదారులకు రూ.11.05 కోట్లు విలువచేసే చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగ నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్‌కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆయా పార్టీలకు చెందిన మండలపార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్‌లు,ఆయా పార్టీలకు చెందిన మండలపార్టీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్: చెక్కుల పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

పటాన్‌చెరు, డిసెంబరు, 9(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ.కాలనీకి చెందిన గంగాధర్‌రెడ్డి సాయికిరణ్ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ. 2.5లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే ఎల్వోసీ అనుమతి పత్రాలను బాధితుడికి అందజేశారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు



పటాన్‌చెరు: చిట్కుల్‌లో సోనియా జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్



జహీరాబాద్: సోనియా జన్మదిన వేడుకల్లో ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, కాంగ్రెస్ నాయకుల



మెదక్‌అర్బన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు కేక్‌లు కట్ చేసి పరస్పరం తినిపించుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించి, ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన నిజమైన తెలంగాణ తల్లి సోనియా గాంధీ అని కొనియాడారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండల పరిధిలోని చిట్కుల్‌లో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు నీలంమధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నీలం ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణా ఏర్పాటులో సోనియాగాంధీ త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. జహీరాబాద్ పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్‌ను కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి డా.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోనియా చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో సోనియా జన్మదిన కేక్‌లను కట్ చేసి సంబురాలను ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్ ఆదరణను ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు



నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

నర్సాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నాయని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, పార్టీ కో ఆర్డినేటర్ ఆంజనేయులుతో పాటు కాంగ్రెస్ పాలన విజయోత్సవాలు, సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సమీపంలో కేకు కట్ చేసి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా హామీలను అమలు చేస్తున్నామని మిగిలిన వాటిని కూడా త్వరలోనే అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్‌రామ్‌రెడ్డి,దుర్గారెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.